# గొడ్రాలు

ఒక గుడ్డివాడిని చూసి సానుభూతి చూపిస్తాము.
ఒక అవిటి వాడిని చూసి అయ్యో అనుకుంటాము.
కానీ గొడ్రాలిని చూసి అవహేళన చేస్తున్నాము.
పిల్లలు కలగక పోవడం ఆమె నేరమా?
అలాంటి వ్యక్తి నీడ పనికి రాదనే తన సెంటిమెంటు మీద నమ్మకంతో తోటి స్త్రీ మనసు మీద గాయం చేయడం అది....అది నేరం.

—జయప్రద

ఈ రోజు శుక్రవారం ఓ. పి. లో పేషెంట్ల రద్ది తక్కువగా తక్కువగా వుంది. ఎదురుగా నా పాత పేషెంట్ భారతి సంకోచంగా ముడుచుకు కూర్చొనుంది.

ముప్పయ్యో వడిలో పడినా మాతృత్వానికి నోచుకోని అభాగ్యురాలామె.

"ఈసారయినా మీ వారిని తీసుకొచ్చావా"

బోషిలా తల అడ్డంగా ఊపిందామె.

ప్రతిసారి ఒక్కతే రావడం, పిల్లలు కలగడానికి ఏమయినా మందులు వ్రాసివ్వమని ప్రాధేయపడటం వ్రాయించుకోవడం, వెళ్ళి పోవడం జరుగుతూనే వుంది. ఆమెకు నేనింతవరకు జరిపిన ప్రతిపరీక్షా సవ్యంగానే వున్నాయి. ఈ విషయం ఆమెకు నాలుగేళ్ళుగా చెపుతూనే వున్నాను.

"చూడు భారతీ! పిల్లలు కలగాలంటే భార్య, భర్త లిద్దరిలోనూ విత్తనం ఉత్పత్తి కావాలి. నీలో ఆ విత్తనం ఉత్పత్తి అవుతోందని తెలుస్తోంది. పోతే ఆయనకు కూడా టెస్ట్ చేసేస్తే నా అనుమానం కాస్తా తీరిపోతుంది. అది చాలా చిన్న టెస్టమ్మా అనవసరంగా జాప్యం చేస్తు న్నావుగానీ—"

ఆ అమ్మాయి తలెత్తి బెదురుగా చూసింది. విని వినిపించన ట్లుంది.

"ఆయనలో ఏ లోపమూ వుండదులెండి డాక్టరుగారూ"

ఆ అమ్మాయికి భయం. ఆమె భర్తలోపం సంతానోత్పత్తికణాలు లేకపోతే ఆ విషయం అతనికి తెలిస్తే అతనెక్కడ బాధపడతాడో, అత నెక్కడ ఆత్మన్యూనతా భావానికి లోనవుతాడో అని.

"నా కింకేదో టెస్ట్ చేయాలన్నారుకదా! అది కూడా చేసేయండి డాక్టరుగారూ"

టెస్టా? ఏం టెస్టది?"

"అదే.... అదేలే ప్రోస్కోప్.... అసలది ఎందుకండీ చేయడం, ఎలా చేస్తారు."

"ఏముంది నీ పొట్టలోకి ఒక రం౹ధం పెట్టి అందులోనుండి లోపల సంతానోత్పత్తికి అవసరమయిన అవయవాలు ఎలా వున్నా యో చూస్తాములే"

"అమ్మో" అల్చిప్పలాంటి నే౹తాల్ని ఇంకాస్త పెద్దవిచేసి చూసింది. భారతి నాకిక్కడ మంచి అవకాశం దొరికింది.

"అదే భారతీ–అది కొద్దిగా పెద్ద టెస్టు కదమ్మా. అందుకే మొదట మీ వారికి ఇం౹దియ పరీక్ష చేసేస్తే అందులో దోషం లేదనుకో తర్వాత నువ్వు ఆ పరీక్ష చేయించుకో వచ్చు. ఏం" ఆశగా చూసాను.

"ఉహుఁ వద్దులెండి వాడిది చేసేయండి. అందులోనే....మరె ప్పుడో అన్నారు చూడండి. నా గర్భసంచి వెనక్కి తిరిగింది-దాన్ని సరిచేస్తాను అని అదికూడా చేసేసెయండి"

"కొందరికి పుట్టుకతో ముందుకు వంగి వుండాల్సిన గర్భసంచి వెనక్కి వంగుంటుంది. అలా వున్నవాళ్ళల్లో చాలా కొద్దిమందికి ఆ కారణంగా పిల్లలు కలగరు. దానికి గిలియంప్ అనే చిన్న ఆపరేషన్ చేసి కుట్లు వేస్తాము"

"అలాగే....అలాగే చేస్తానమ్మా భారతీ! కానీ మొదట మీవారితో మాట్లాడనీ" తెలివిగా అన్నాను.

ఇంకా తెలివిగా అందామె "ఏ విషయం గురించి మాట్లాడా లండి"

"అది పెద్ద టెస్టుకదా! దానికి మీవారి సంతకం కావాలి. అది గాక హిస్టరోసాల్పింగో ౹గాబ్ అని, ఎక్స్‌రే కూడా తీయాలి నీకు. అందుకాయన దగ్గరుండాలి."

"ఓహో! అందుకా అలాగే రేపాయన్ని తీసుకొస్తాను" సంతో షంగా అంది. ఆమె వెళ్ళే లోపలే మరో పేషెంట్ ఎ౹రటి రిపోర్టు కాగి తాంతో నా కెదురుగా నిల్చుంది.

ఆమె భర్త రిపోర్టులో ఇంద్రియ కణాలు లేవు. ఆ అమ్మాయివంక జాలిగా చూస్తూ అన్నాను.

"చూడమ్మా, మీ వారిలో పిల్లలు కలగడానికి అవసరమయిన జీవకణాలు లేవు. మగ డాక్టర్ దగ్గరికి వెళ్ళండి జాబు వ్రాసిస్తాను. వాళ్ళు మీ వారికి చిన్న ముక్క పరీక్ష చేస్తారు"

నేననుకున్నట్టు ఆమె నా వైపు దిగులుగా చూడలేదు. నా ప్రక్కగా వచ్చి నా చెవిలోకి వంగి ఇలా అంది-

"డాక్టరమ్మా! మా వారు బయటున్నారు పిలుస్తాను. ఈ సంగతి ఆయనక్కాస్త చెప్పండి. రోజూ రెండో పెళ్ళి చేసుకుంటానని బెదిరిస్తున్నాడు గొప్ప"

"ఇలాంటప్పుడే నాకు దిగులేస్తుంది. భార్యలో దోషం వుంటే చాలు మరో పెళ్ళి చేసుకుంటాననే యీ పురుష పుంగవులు తనలో దోషం వుంటే తన భార్యకు మరలా పెళ్ళి చేస్తారా. ఉహూ. చేసుకోవాలని ఆ పిల్ల కోరదు కూడా. వేద మంత్రాలమధ్య తల వంచుకుని అతని చేత మూడుముళ్ళు వేయించుకునేది పిల్లల్ని కనడానికి మాత్రమే కాదు. జన్మంతా నాతోడు నీకుంటుందనే భరోసా ఇవ్వటానికే అని ఆమెకు తెలుసు. ఈ విషయం భర్తకెందుకు తెలీడంలేదు. పసుపు బట్టలతో కొంగుముడి వేసుకున్నప్పుడు పిల్లలు కలగకపోతే కొంగుముడి విప్పేస్తావనే మంత్రం అతను చదువుతున్నాడా....నాతిచరామి అంటున్నారు కానీ తండ్రి కావాలి అనే ఆకాంక్షతో అది మర్చిపోతున్నారు. ఎంత అమానుషత్వం.

అతను లోపలికొచ్చాడు. విషయం అతనికి చెప్పాను. భార్యాభర్త ఇద్దరూ ఓయస్సీకి అంగీకరించలేదు. ఇది నాకు క్రొత్తకాదు. ఆ పరీక్ష చేస్తే అతను పనీ పాటకు పనికిరాకుండా పోతాడని వాళ్ళ నమ్మకం. చిన్న ముక్క పరీక్షకు తీసుకున్నందువల్ల ఎలాంటి నష్టమూ జరుగదని చెప్పినా వినలేదు వాళ్ళు.

మర్నాడు సాయంత్రం ఓ. పి. ప్రారంభిస్తున్న సమయంలో భారతి తన భర్తతో తన దగ్గరకొచ్చింది.

"మీరు నాతో మాట్లాడాలన్నారట" అన్నాడతను నాకు విష్‌చేసి.

"మీ భార్యకు హిస్టరోసాల్పింగ్ గ్రామ్ చేయాలి. ఆ టెస్టు చేసే ప్పుడు మీరుంటే బాగుంటుందని రమ్మన్నాను"

అతను ముందుకు జరిగాడు. "డాక్టర్ మీరేమీ అనుకోకపోతే ఆ టెస్టు ఎందుకు చేస్తారు"

"గర్భసంచిలోకి డై ఎక్కించి సంచి ఎలా వుందో చూస్తాము. ఓవరీస్‌నుండి విత్తనాన్ని గర్భసంచిలోకి మోసుకొచ్చే గొట్టాలు బావు న్నాయో లేక ముడుచుకుపోయి విత్తనాన్ని గర్భసంచిలోకి రానీకుండా అడ్డుపడుతున్నాయా అని చూస్తాము"

"ఓ. కే మీ యిష్టం మీరేమయినా చేయండి. కానీ డాక్టరుగారూ! మీరు నన్ను ఒక్కసారయినా టెస్టు చేయలేదు. అవసరం లేదంటారా?"

అతని నోటినుంచి ఆ ప్రశ్న రావడానికి ఎదురు చూస్తున్నాను.

"మీ మిసెస్‌తో చెబుతూనే వున్నాను. కానీ ఆమె మీకు ఇన్‌వెస్టి గేషన్స్ చేయించడానికి ఇష్టపడటంలేదు."

"ఇష్టపడటం లేదా? ఎందుకని"

"మీలో ఏదయినా లోపం వుంటే మీరు బాధపడతారంట"

అతని ముఖంలో ఆశ్చర్యార్థక స్థానంలో ఆరాధన భావం.

"పిచ్చిపిల్ల అందులో బాధపడాల్సిందేముంటుంది. మీకు మొదట నాకు చేయాల్సినవన్నీ చేయించండి డాక్టర్. తర్వాత ఆమె గురించి చూద్దాము."

మర్నాడు ఉదయం అతని రిపోర్టులోకి చూసాను.

నే వూహించినట్లుగా అతనా వార్త విని అప్‌సెట్ కాలేదు. ఓ నిముషం మాత్రం మౌనంగా వుండి తర్వాత అడిగాడు-

"ఆ జీవకణాలతో అవసరం లేకుండా ఆమెకు పిల్లలు కలిగే అవకాశం ఏదో వుందని విన్నాను. మీరది సజెస్ట్ చేయగలరా!"

నేను నిజంగా ఆశ్చర్యపోయాను. తనలో లోపాన్ని భార్యకు చెప్పొద్దని బ్రతిమిలాడే భర్తల్ని, భర్తకు తెలియకుండా అలా చేయించు కోడానికి ముందుకొచ్చే భార్యల్ని ఇంతవరకు చూసాను.

"ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ గురించి మీరడుగుతున్నారు అవునా. బెంగుళూరులో మీకు దగ్గరగా ఆ ఫెసిలిటి వుంది. కానీ మొదట భారతితో సంప్రదించండి."

"వద్దు డాక్టర్ ఆమెతో చెప్పొద్దు. ఈ విషయం వింటే తట్టుకో లేదు."

"ఓ. కే. మీ ఇష్టప్రకారమే చేస్తాను. ఆమెను లోపలకు పంపండి"

"మీవారికంతా బాగుందమ్మా భారతీ. నీకో జాబు వ్రాసిస్తాను బెంగుళూరులో నీకింకొన్ని టెస్టులు జరగాలి అవీ చూసాక నీకు మందులు వ్రాస్తాను. దిగులు పడకు తప్పక పిల్లలు పుడతారు."

నేను వూహించినట్లుగా ఆమె ముఖం వికసించలేదు.

"నేనంతా విన్నాను డాక్టర్! నాకంటూ పిల్లలు పుడితే అది ఆయన ప్రతిరూపమే కావాలి నాకు. లేకపోతే నాకసలు పిల్లలే వద్దు"

ఆమె గొంతు వణికింది. ఆమె కళ్ళలో నీళ్ళు.

"ఏమ్ భారతీ! ఏమిటది కన్నీళ్ళా! ఛీఛీ... "

భార్య వెక్కిళ్ళకు అతను లోపలికి వచ్చాడు.

నేను భారతిని వోదార్చడానికి ప్రయత్నిస్తున్నాను.

"ఇందులో తప్పేముందమ్మా! ఎన్ని మందులు వాడలేదు నీకు నేను. అందులో ఇది ఒకటనుకో. మనకు తెలియని వ్యక్తి యింద్రియాన్ని ప్రిజర్వుచేసి అవసరమయిన వాళ్ళ గర్భసంచిలోకి ఎక్కిస్తారంతే...."

రోషంగా చూసింది భారతి. ఆమె ఈ రకంచూపు నాకు కొత్త కాదు.

"ఆడపిల్ల సంకోచపడటానికి మగవాడు అభ్యంతరం పెట్టడానికి అందులో ఏముంది? ఏ అనాద బిడ్డనో ఎందుకు పెంచుకోకూడదు మీరు"

అతను నవ్వాడు విరక్తిగా కొద్దిగా నిరాశగా.

"ఎందుకు పెంచుకోకూడదు డాక్టర్‌గారూ! మనకు ముసలితనంలో ఆధారం కావాలనుకుంటే మనకు పుట్టాలనే ఏముంది? పసిబిడ్డను పెంచుకుంటే మనకు ఆధారం కాదు? అది నేను చెపుతూనే వున్నాను. అదామెకు అర్థమైతేకదా?"

అతను భార్యవేపు కోపం, విసుగుగా చూసాడు.

"అలాగే మీ ఇష్ట ప్రకారమే పెంచుకుంటాను. కానీ అప్పుడు, అప్పుడు నన్నీలోకం గొడ్రాలు అనడం మానేస్తుందా?"

ఆ నాలుగు మాటలు అనేసి పగిలిన కుండలా రోధించింది భారతి.

అతని కోపం మంచులా కరిగిపోయింది.

భార్య దగ్గరకొచ్చి తలమీద చెయ్యి వేసాడు.

"పిచ్చిపిల్ల, నీ యిష్టం. ఎలావుంటే అలా చేస్తాను. చూడు డాక్టర్‌గారికి ఎంత టైము వేస్టో మనవల్ల."

అతను భార్యను లేపాడు. నావేపు చూసాడు.

"డాక్టర్‌గారూ! నా భార్యను మీ దగ్గరకు పంపింది మా ఇద్దరినీ ఉద్ధరించడానికి....పిల్లలు కావాలనికాదు. నా భార్యను ఈ ఆడవాళ్ళంతా కలిసి గొడ్రాలు గొడ్రాలు అంటుంటే ఆ భార్య కన్నీళ్ళు చూడలేక పంపాను. మా ఇద్దరం ఒకరికొకరం చాలు. మాకు పిల్లలు అవసరం లేదు. నేను భారతికి నచ్చచెప్పుకుంటాను. లేదా ఇంకా పిల్లలు కావాలనుకునే భ్రాంతి వదలకపోతే యీ సంఘాన్ని ఎదిరించే శక్తి నా భార్యకు రాకపోతే....ఆర్టిఫిషియల్ ఇన్‌సమినేషన్ చేయించుకోడంలో ఏ తప్పు లేదని నాలా భారతి కూడా నమ్మినరోజు మరలా మీ దగ్గరకు వస్తాను."

చేతులు జోడించి భార్యను నడిపించుకుని వెళ్ళిపోయాడతను.

మాతృత్వపు క్షమాదుర్భాగ్యాన్ని ఓ తల్లికి సృష్టి కరువుచేస్తే-యీ సంఘం గొడ్రాలు కొన్నిటికి పనికిరాదనే పిచ్చి సెంటిమెంట్స్‌తో ఆమెకు మనశ్శాంతిని కరువు చేస్తుంది. ఎంత అమానుష దశలోవున్నాం మనం.

*